తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
బుధవారం
11 ఫిబ్రవరి 2026
పేజీలు : 12
Follow :

## మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు సిద్ధం

### నేడు జిల్లాలోని 11 మున్సిపాలిటీల్లో పోలింగ్




సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 10 (జనం సాక్షి)
జిల్లాలోని 11 మున్సిపాలిటీల్లో ఈ నెల 11న (బుధవారం) నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియో గించుకునేలా అన్ని ఏర్పాట్లు చేపట్టారు.నేడు సంగారెడ్డి, సదాశివపేట, కోహిర్, జహీరాబాద్, నారాయణఖేడ్, జిన్నారం, ఆందోల్--జోగిపేట్, ఇస్నాపూర్, ఇంద్రేశం, గుమ్మడిదల, గడ్డపోతారం మున్సిపాలిటీలలో ఎన్నికలు జరగనున్నాయి. జిల్లాలోని 11 మున్సిపాలిటీల్లో మొత్తం 256 వార్డులు ఉండగా, వాటికి గాను 541 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.
ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసారు. మొత్తం 3,41,808 మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో పాల్గొననున్నారు. వారిలో
పురుషులు -- 1,71,151
మహిళలు -- 1,70,638
ఇతరులు -- 19
మున్సిపాలిటీ వారీగా ఓటర్ల వివరాలు
ఆందోల్--జోగిపేట్ : 20 వార్డులు, 32 పోలింగ్ కేంద్రాలు 16,450 మంది ఓటర్లు
గడ్డపోతారం : 18 వార్డులు 18 పోలింగ్ కేంద్రాలు 11,983 ఓటర్లు
గుమ్మడిదల : 22 వార్డులు 44 పోలింగ్ కేంద్రాలు 23,926 ఓటర్లు
ఇంద్రేశం : 18 వార్డులు 19 పోలింగ్ కేంద్రాలు 13,086 ఓటర్లు
ఇస్నాపూర్ : 26 వార్డులు 60 పోలింగ్ కేంద్రాలు 35,912 ఓటర్లు
జిన్నారం : 20 వార్డులు 22 పోలింగ్ కేంద్రాలు 12,473 ఓటర్లు
కోహిర్ : 16 వార్డులు 16 పోలింగ్ కేంద్రాలు 10,832 ఓటర్లు
నారాయణఖేడ్ : 15 వార్డులు, 30 పోలింగ్ కేంద్రాలు 17,675 ఓటర్లు
సదాశివపేట : 26 వార్డులు, 58 పోలింగ్ కేంద్రాలు 36,982 ఓటర్లు
సంగారెడ్డి : 38 వార్డులు, 121 పోలింగ్ కేంద్రాలు 83,668 ఓటర్లు
జహీరాబాద్ : 37 వార్డులు 121 పోలింగ్ కేంద్రాలు 78,819 ఓటర్లు

**జిల్లాలో 103 మంది రిటర్నింగ్ అధికారులు :** జిల్లా వ్యాప్తంగా 103 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, 649 మంది ప్రిసైడింగ్ అధికారులు, 649 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 1,948 మంది ఇతర పోలింగ్ అధికారులు,73 మంది మైక్రో అబ్జర్వర్లు , 49 మంది జోనల్ ఆఫీసర్లను నియమించారు. ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా శాంతిభద్రతలు కట్టుదిట్టంగా ఉండేలా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక వసతులు కల్పించి, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

## ఎన్నికల వేళ తీవ్ర విషాదం

### ఆత్మహత్యకు పాల్పడ్డ ఆరవ వార్డు బీజేపీ అభ్యర్థి ఏరుకలి మహాదేవ్






మక్తల్, ఫిబ్రవరి 10 (జనంసాక్షి)
మున్సిపల్ ఎన్నికలకు ఒక రోజు ముందు తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అధికార పార్టీ నుండి వస్తున్న బెదిరింపులను తాలలేక మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఆరవ వార్డు బీజేపీ అభ్యర్థి తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య పాల్పడ్డ సంఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో ఆరవ వార్డు నుండి బీజేపీ అభ్యర్థిగా ఎరుకలి మహదేవ్ రిజర్వుడు వార్డు నుండి పోటీ చేస్తున్నారు. అతడి సొంత అన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. ప్రజల మద్దతుతో గెలుపు దిశలో ముందుకెళుతున్న సమయంలో అధికార పార్టీ నుండి ఒత్తిడిలు బెదిరింపులు రావడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యారు.దీంతో పార్టీ నాయకుల వద్ద తనకు బెదిరింపులు వస్తున్నాయని ఒత్తిడి చేస్తున్నారని సరెండర్ కావాలి లేదా పోటీ నుండి తప్పుకోవాలని నామినేషన్ల సమయం నుండి ఒత్తిడి చేస్తున్నట్లు తెలిపారు. పోటీలో ఉండి ప్రచారంలో దూసుకుపోతూ గెలుపు బాటలో పయాణిస్తున్న సందర్భంలో బెదిరింపులు ఒత్తిడిలు తీవ్ర కావడంతో ఇవాళ తెల్లవారుజామున ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిద్ర నుండి లేచిన కుటుంబ సభ్యులకు ఉరివేసుకొని కనిపించడంతో వెంటనే కిందకు దించి ఆసుపత్రికి తరలించాలని ప్రయత్నించగా అప్పటికే ప్రాణాలు పోయినట్లు గుర్తించారు. బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య కలకలం రేపింది. గత ఐదారు రోజులుగా తన భర్తకు బెదిరింపులు ఒత్తిడిలు రావడం వల్ల తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు మృతుడి భార్య తెలిపారు. మొత్తం మీద ప్రత్యర్థుల ఒత్తిడితో తీవ్ర మానసిక మిగతా8లో

## తాళం వేసున్న ఇండ్లకే టార్గెట్ చేసిన దుండగులు

**గంగ్వార్‌లో 5 ఇండ్ల తలుపులను పగులగొట్టి చోరీకి పాల్పడ్డ గుర్తుతెలియని వ్యక్తులు**
**నగదు, బంగారంతో పరారైన దుండగులు**
**విచారణ చేపట్టిన సంగారెడ్డి క్లూస్ టీమ్ సీఐ, స్థానిక పోలీసులు**



న్యాల్‌కల్, ఫిబ్రవరి 10 (జనం సాక్షి) : చుట్టూ పంట పొలాలు. నిర్జీవ ప్రదేశాలు. చోరీకి పాల్పడి నిమిషాల్లో పరారయ్యే స్థలాలు. తాళం వేసున్న ఇండ్లను మరి టార్గెట్ చేసుకొని గుర్తుతెలియని దుండగులు, ఇండ్ల తలుపుల గొలుసులు, తాళాలను పగలగొట్టి ఇళ్లల్లోకి చొరబడి చోరీలకు పాల్పడి కొంత నగదు, బంగారు ఆభరణాలను దొంగలించి పరారైన సంఘటన సంగారెడ్డి జిల్లా, న్యాల్ కల్ మండలం, గంగ్వార్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది.

**ఐదు ఇండ్ల తలుపులను పగలగొట్టి చోరీకి పాల్పడ్డ దుండగులు**

జహీరాబాద్ – బీదర్ రోడ్డు, న్యాల్ కల్ మండలం, గంగువార్ గ్రామంలో మంగళ వారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితులు, పలువురు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోయిని లక్ష్మి, వెంకట్ రెడ్డి, వీరారెడ్డి, గుండన్న, మాల వెంకట్ ల ఇండ్లల్లోకి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇండ్లకు తాళం వేసి ఉండడం, ఇండ్ల పరిసర ప్రాంతాల్లో నిర్జీవ ప్రదేశం, పంట పొలాలు ఉండడంతో గుర్తు తెలియని కొందరు దుండగులు మిగతా6లో

## ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించుకోవాలి

### - సిద్దిపేట పోలీస్ కమిషనర్ పెరుమాళ్ రష్మీ



చేర్యాల (జనంసాక్షి) ఫిబ్రవరి 10 : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని, ఓటర్లను బెదిరిస్తే కఠిన చర్యలు తప్పు అని సిద్దిపేట పోలీస్ కమిషనర్ పెరుమాళ్ రష్మీ తెలిపారు. మంగళవారం చేర్యాల మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మిగతా3లో

## ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు



### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి బ్యూరో ఫిబ్రవరి10 జనంసాక్షి
ఫిబ్రవరి 11న వనపర్తి జిల్లాలోని 5 మున్సిపాలిటీల్లో నిర్వహించనున్న పోలింగ్ లో ఓటర్లు తమ ఓటు ను ఖచ్చితంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కోరారు.మంగళవారం వనపర్తి మున్సిపాలిటీకి సంబంధించి నర్సింగాయపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని, పెబ్బేరు మున్సిపాలిటీ కి సంబంధించి ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాల, కొత్తకోట మున్సిపాలిటీ కి సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, అక్కడే ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు.పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ తో పాటు ఎన్నికల రోజు సాయంత్రం రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు సైతం పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మిగతా9లో

# ఎన్నికలు నిస్పక్షపాతంగా నిర్వహించాలి

మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



మహబూబ్ నగర్ బ్యూరో ఫిబ్రవరి 10 (జనం సాక్షి) : ఎన్నికలు నిస్పక్షపాతంగా నిర్వహించాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం మహబూబ్ నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వెంటనే ఎన్నికల కమిషన్ పరిధిలో అధికారులు పని చేయాలి రాష్టంలో కానీ..మహబూబ్ నగర్ జిల్లాలో కానీ ఆ పరిస్థితి కనిపిస్తలేదన్నారు. పోలీస్ అధికారులే మొత్తం నడుపుతున్నారు.. అన్ని శాఖల పనులు విల్లు చేస్తున్నారన్నారు. ఒక పార్టీ కి సంబంధించి అభ్యర్థి స్వచ్ఛందంగా వచ్చి మద్దతు ఇస్తామని ముందుకు వస్తే అతనిని పోలీస్ లు బెదిరించి మాట మార్చేవిధంగా చేసారు ఇలాంటి అరాచక శక్తులకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో న్యాయవాదులు బెక్కం జనార్ధన్, మనోహర్, కరుణాకర్ గౌడ్, స్వదేశ్, మురళి, ఉమామహేశ్వరి, రవిప్రకాష్, శ్రీహరి, రాంనాథ్ గౌడ్, శ్రీ రామ్ కుమార్ , మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని జయప్రదం చేయండి

మెదక్, ఫిబ్రవరి 10(జనం సాక్షి):



ఫిబ్రవరి 12 తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి కే. నర్సమ్మ పిలుపునిచ్చారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 రకాల కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం వాటి స్థానం లో 4 లేబర్ కోడులను అమల్లోకి తెచ్చిందన్నారు. లేబర్ కోడులను రద్దు చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని, విత్తన సవరణ చట్టం రద్దుచేయాలని, విద్యుత్ సవరణ బిల్లు ను ఆమోదం చేయవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ సమ్మె జరుగుతుందని అన్నారు. మండలం లోనీ కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు.

# మున్సిపల్ ఎన్నికలకు మెదక్ పోలీసుల కట్టుదిట్టమైన భద్రత



**ఎన్నికల భద్రత కోసం ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్సులు**

**ఎన్నికల సమయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**163 బిఎన్ఎస్ఎస్ అమలు -- గుంపులు నిషేధం**

**జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు**

మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 10 (జనం సాక్షి):

మెదక్ జిల్లా పరిధిలో జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. మంగళవారం మెదక్ టౌన్ కేంద్రంలోని వేస్లీ కాలేజీ ప్రాంగణంలో మున్సిపల్ ఎన్నికల బందోబస్తు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బందికి ఆయన స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో క్రమశిక్షణగా విధులు నిర్వహించాలని సూచించారు. ఉదయం ప్రారంభం నుంచే ప్రతి పోలీసు సిబ్బంది తమ డ్యూటీ పోస్టులకు హాజరై, ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి, వారికి అవసరమైన సహకారం అందించాలని సూచించారు. జిల్లాలో నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 74 వార్డులు, 148 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మొత్తం 686 మంది పోలీస్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఎన్నికల భద్రతా చర్యలలో భాగంగా 17 రూట్లలో ఎస్ఐ స్థాయి అధికారులతో రూట్ మొబైల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. సీఐల ఆధ్వర్యంలో స్పెషల్ స్ట్రైకింగ్ టీమ్స్, నలుగురు డీఎస్పీల ఆధ్వర్యంలో స్ట్రైకింగ్ ఫోర్సులను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికలు జరుగుతున్న మున్సిపాలిటీల పరిధిలో బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్ 163 అమల్లో ఉంటుందని, దీని ప్రకారం నలుగురికి మించి గుంపులుగా గుమికూడరాదని తెలిపారు. ఏదైనా అనుమానాస్పద చర్యలు గమనించినట్లయితే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి జిల్లా ప్రజలు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

GITAM
DEEMED TO BE UNIVERSITY

# ఉన్నత విద్యలో మూల్యాంకనంపై ఎఫ్.డీ.పీ.

**- ప్రధాన వక్తలుగా డాక్టర్ సుపర్ణ మజుందార్ కర్, డాక్టర్ శ్వేతా ముఖర్జీ**






పటాన్చెరు ఫిబ్రవరి 10 (జనంసాక్షి) హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 'ఉన్నత విద్యలో మూల్యాంకనం'పై రెండు రోజుల అధ్యాపక వికాస కార్యక్రమాన్ని (ఎఫ్.డీ.పీ)ని ఈనెల 13-14 తేదీలలో నిర్వహించనున్నట్టు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ఇంటెన్సివ్, ఆచరణాత్మక కార్యశాలలో అన్ని విభాగాలలోని అధ్యాపకులను ఆచరణాత్మక నైపుణ్యాలతో సన్నద్ధం చేయడం ద్వారా ప్రభావవంతమైన, ఫలిత-ఆధారిత అంచనా పద్ధతులను రూపొందించడానికి, అమలు చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలియజేశారు. కృత్రిమ మేధస్సు (ఏఐ), హైబ్రిడ్ అభ్యాస వాతావరణాల సవాళ్లకు ప్రతిస్పందిస్తూ, ఈ కార్యక్రమం విమర్శనాత్మక ఆలోచన, వాస్తవికత, అర్థవంతమైన విద్యార్థుల అభ్యాసాన్ని ప్రోత్సహించే ప్రామాణికమైన, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న అంచనా వ్యూహాలపై దృష్టి సారిస్తుందన్నారు. ఎఫ్.డీ.పీ. రూబ్రిక్ అభివృద్ధి, మూల్యాంకన రూపకల్పన, డిజిటల్ సాధనాల వాడకంపై ముఖాముఖి కార్యక్రమాల మేలు కలయికగా ఇది కొనసాగుతుందని తెలిపారు. బెంగళూరులోని క్రైస్ట్ డీమ్డ్ విశ్వవిద్యాయంలోని సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ సుపర్ణ మజుందార్ కర్, బెంగళూరు ప్రాంగణంలోని గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఇన్ ఛార్జ్ డైరెక్టర్ డాక్టర్ శ్వేతా ముఖర్జీ ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తలుగా వ్యవహరిస్తారన్నారు.



# సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో నూతన ప్రెస్ క్లబ్‌కు ఘన సన్మానం

**సాహితి కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్**

శ్రీరంగాపురం ఫిబ్రవరి 10: జనం సాక్షి.

పత్రికా రంగానికి సేవలందిస్తున్న నూతన ప్రెస్ క్లబ్‌కు సాహితీ కళావేదిక కళాకారులు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులను శాలువాలు సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ సమాజంలో జరిగే మంచి--చెడు అంశాలను ప్రజలకు తెలియజేయడంలో జర్నలిస్టుల పాత్ర అమూల్య మన్నారు. ప్రజాస్వామ్యంలో పత్రికా రంగం నాల్గవ స్థంభంగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో కీలకంగా నిలుస్తుం దన్నారు. అలాంటి బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తున్న ప్రెస్ క్లబ్ సభ్యులను సన్మానించడం గర్వకారణమని తెలిపారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బాలరాజు మాట్లాడుతూ కళాకారులు, సాహితీవేత్తలు జర్నలిస్టులకు ఎల్లప్పుడూ అండగా నిలవడం ఆనందకరమన్నారు. భవిష్యత్తులో సమాజ హిత కార్యక్రమాల్లో సాహితీ కళావేదికతో కలిసి పనిచేస్తామని తెలిపారు. అనంతరం సాహితీ కళా వేదిక కళాకారులు , జర్నలిస్టుల ఆధ్వర్యంలో శిలవు నీవే శిల్పివీ నీవే పుస్తకావిష్కరణ చేశారు.ఈ కార్యక్రమంలో కవి జనజ్వాల, సినారె అవార్డు గ్రహీత సత్తార్, వాక్యత బైరోజు చంద్రశేఖర్, బాలస్వామి, స్వామి, రాములు, ఉప సర్పంచ్ కళ్యాణికారి ఖాజా, పి సుదర్శన్ రెడ్డి . జర్నలిస్టులు రంగస్వామి నాయుడు, వేణుగోపాల్, కిట్టు స్వామి, శివ సాగర్, నరేష్ గౌడ్, హరీష్ గౌడ్, నారాయణ, పెండెం నరేష్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## ప్రహరీ గోడ పనుల్లో.. ప్రథమ పౌరుడు



పాపన్నపేట, ఫిబ్రవరి 10 (జనంసాక్షి) : దౌలాపూర్ గ్రామం లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ పనులు మంగళవారం ప్రారంభమాయ్యాయి. గ్రామ సర్పంచ్ రేషబోయిన అంజయ్య,ఉపసర్పంచ్ పట్నం అంజయ్య సంబంధిత పనులను వార్డు సభ్యులు మాధవి మల్లేశంతో కలిసి చేపట్టారు. ప్రక్కనే ప్రయాణ రహదారి ఉన్నందున్న సకాలంలో ప్రహరీ గోడ నిర్మాణం పూర్తయితే పిల్లలకు రక్షణగా ఉంటుందన్నారు. గ్రామ ప్రథమ పౌరుడు సైతం ఈ పనుల్లో చురుగ్గా పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించుకోవాలి

పకడ్బందీ బందోబస్తు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఓటర్లు, వికలాంగులు, యువకులను పోలీస్ శాఖ ఎవరిని కూడా ఇబ్బందులకు గురిచేయవద్దని పోలీసు సిబ్బందికి సూచించారు. ఎన్నికల్లో నిలబడ్డ అభ్యర్థులు పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో ఉండాలన్నారు. కార్యక్రమంలో చేర్యాల సిఐ బానోతు రమేష్ నాయక్, చేర్యాల ఎస్సై వేముల నవీన్, కొమురవెల్లి ఎస్సై మహేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## "మెపా"చేర్యాల మండల అధ్యక్షుడిగా చింతల పరుశురాములు



చేర్యాల(జనంసాక్షి) ఫిబ్రవరి 10 : ముదిరాజ్ ఎంప్లాయిస్ ప్రొఫెషనల్ అసోసియేషన్ తెలంగాణ సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం అధ్యక్షుడిగా చింతల పరశురాములు ముదిరాజ్ ను నియమిస్తూ "మెపా" వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చింతల పరశురాములు మాట్లాడుతూ.. నా ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షులు పిట్ల ఆంజనేయులు,ప్రధాన కార్యదర్శి నాయిని కృష్ణ లకు కృతజ్ఞతలు తెలిపి, సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పరుశురాములు మాట్లాడుతూ.. మండలంలో ముదిరాజ్ ల ఐక్యత కొరకు కృషి చేస్తామని,ఈ ప్రభుత్వంపై రిజర్వేషన్ కోసం ఒత్తిడి చేస్తామని అన్నారు.

## మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేత



కోహెడ ఫిబ్రవరి 10:( జనం సాక్షి):- మండలం కేంద్రం లోని పోచమ్మ వాడకు చెందిన శ్రావనపల్లి వెంకటేశం ఇటీవల అనారోగ్యం తో మృతి చెందగా అతని కుటుంబ సభ్యులకు కాలనీ వాసులు, యువత కలిసి 10 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. వారి కుటుంబానికి ఎంతో కొంత ఆసరా గా ఉంటుందని వారు అన్నారు. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ పార్టీ మండల యువత అధ్యక్షులు జాలిగం శంకర్ ,గాయత్రి మెడికల్ షాప్ ప్రొప్రేటర్ జాలిగం రాజు,కోహెడ మండల పెయింటర్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం మహేష్, శ్రావనపల్లి చంద్రకాంత్ తదితరులు ఉన్నారు.

## బందోబస్తులో పోలీస్ సిబ్బంది పాత్ర కీలకం

**విధులు కేటాయించిన ప్రాంతాన్ని విడిచిపెట్టవద్దు : అదనపు ఎస్పీ మహేందర్**

మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 10 (జనం సాక్షి ): మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ గారు ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీస్ సిబ్బందికి తూప్రాన్ లోని నోబెల్ ఫార్మసీ కళాశాలలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది ఎన్నికల కోడ్ (ఎంసీసీ) నియమాలను ఖచ్చితంగా పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.విధుల నిర్వహణలో సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని, ఎన్నికల భద్రత సమష్టి బాధ్యత అని అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు. ఈ కార్యక్రమం లో తూప్రాన్ ఆర్డీ ఓ జయచంద్ర రెడ్డి, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, తూప్రాన్ సీఐ రంగా కృష్ణ ఎసై లు, సిబ్బంది పాల్గొన్నారు.




# న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలి

**- బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఏ. మాలిక్ షాకిర్**



జడ్చర్ల, ఫిబ్రవరి 10 (జనంసాక్షి):న్యాయవాదుల రక్షణ కోసం ప్రతిపాదించిన చట్టాన్ని ప్రభుత్వం వెంటనే అమలులోకి తీసుకురావాలని జడ్చర్ల న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.ఏ. మాలిక్ షాకిర్ డిమాండ్ చేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా న్యాయవాదుల సంఘం పిలుపు మేరకు జడ్చర్ల న్యాయవాదులు 2వ రోజు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. మంగళవారం న్యాయ వాదులందరూ కోర్టు విధులకు దూరంగా ఉండి తమ ఐక్యతను చాటారు. ఈ సందర్భంగా ఎం.ఏ. మాలిక్ షాకిర్ మాట్లాడుతూ న్యాయవాది కుమారి స్వప్నను అమానుషంగా హత్య చేసిన నిందితులపై త్వరితగతిన విచారణ జరిపేందుకు ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు. రాష్ట్రంలో న్యాయవాదులపై దాడులు నిత్యకృత్యమవుతున్నా ప్రభుత్వం స్పందన నామమాత్రంగానే ఉండటం శోచనీయమన్నారు. అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి చాలా కాలం గడుస్తున్నా చట్టం అమలులో జాప్యం జరుగుతోందని, తక్షణమే రక్షణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం న్యాయవాదులందరూ కోర్టు నుండి జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించి చట్టాన్ని అమలు చేసే వరకు తమ పోరాటం ఆగదని, భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్. ప్రశాంత్, కార్యదర్శి జి. రమేష్, లక్ష్మీనారాయణ, పాండు కుమార్, మహేశ్వర్ రెడ్డి, యాదిరెడ్డి, బాస్కర్ రెడ్డి, కె. జంగయ్య, ఖాజా ఇష్తేఖారుద్దీన్, అబ్దుల్ కలీం, పురుషోత్తం రావు, శంకరాచారి, నర్సింహులు, ఫిలిప్ రాజు, జి. రాములు, కౌసర్, అజహార్, రఘురాం, సంబు శ్రీనివాస్, పెంద్యాల విజయ్ కుమార్, జి. విజయ్ కుమార్, సుబ్రమణ్యం, తిరుపతయ్య తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## అభివృద్ధిపై చిత్తశుద్ధి ఏదీ : భాజపా



పాపన్నపేట, ఫిబ్రవరి 10 (జనంసాక్షి) : మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ క్షేత్రానికి తరలివచ్చే భక్తుల వసతికై దేవాదాయ శాఖ అధికారులు శాశ్వత నిర్మాణాలు చేపట్టాలని పాపన్నపేట భాజపా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏడుపాయలలో బీజేపీ మండల అధ్యక్షుడు వడ్ల సంతోష్ చారీ పార్టీ శ్రేణులతో కలిసి మాట్లాడారు. గత భారాస ప్రభుత్వం రూ.100 కోట్లు,నేడు రేవంత్ సర్కార్ రూ.35 కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తామన్నారని,కానీ ఈ ప్రాంతంలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. మహిళాలు దుస్తులు మార్చుకునే సదుపాయాలు సైతం అరకొరగా ఉన్నాయన్నారు. దేవదాయ ధర్మదాయ శాఖ ఆదాయం పై దృష్టి పెట్టింది కానీ అభివృద్ధి మీద చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా మహాశివరాత్రి జాతరకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు.నాయకులుదుర్గయ్య,శంకరయ్య,చంద్రయ్య,లక్ష్మణరావు,భూషణం,గౌస్ పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై జగ్గారెడ్డిపై కేసు నమోదు



సదాశివపేట ఫిబ్రవరి 10(జనం సాక్షి) పురపాలక సంఘ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన కేసులో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ జయప్రకాష్ రెడ్డి (జగ్గారెడ్డి)పై సదాశివపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మంగళవారం (10-02-2026) ఉదయం సుమారు 10.30 గంటల సమయంలో సదాశివపేట మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ (ఖీూ)కు, పట్టణంలోని బస్ స్టాండ్ సమీపంలో ఉన్న చాంద్ భాయ్ హోటల్ వద్ద జయప్రకాష్ రెడ్డి కొంతమందితో కలిసి డబ్బులు పంపిణీ చేస్తున్నారన్న సమాచారం అందింది. ఈ సమాచారం మేరకు ఎఫ్ ఎస్ టి టీమ్ వెంటనే అక్కడికి చేరుకుని తనిఖీలు నిర్వహించింది.తనిఖీల సమయంలో అక్కడ జయప్రకాష్ రెడ్డి ఉన్నట్టు గుర్తించిన పోలీస్ అధికారులు, అయితే ఆయన ఎవరికి డబ్బులు పంపిణీ చేయడం లేదని నిర్ధారించారు. అయినప్పటికీ, ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్‌కు 48 గంటల ముందు ఇతర ప్రాంతాలకు చెందిన రాజకీయ నాయకులు సంబంధిత ఎన్నికల ప్రాంతంలో ఉండకూడదనే నిబంధనను ఆయన ఉల్లంఘించినట్లు అధికారులు నిర్ధారించారు.ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు సంబంధించి జయప్రకాష్ రెడ్డి (జగ్గారెడ్డి)పై సదాశివపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.



## నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు

**న్యాల్ కల్ మండల ఎంపీడీఓ షగుప్త ఇర్ఫాత్**

న్యాల్ కల్, ఫిబ్రవరి 10, (జనం సాక్షి) : ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, తదితర కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా ప్రోటోకాల్ ను పాటించాలని, ప్రోటోకాల్ ను ఉల్లంఘించి పనులు చేపడితే ప్రజా ప్రతినిధులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులపై శాఖపరమైన చర్యలు తప్పవని మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి షాగుప్త ఇర్ఫాత్ స్పష్టం చేశారు. మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థలు ఎన్నికల్లో విజయం సాధించి, ప్రమాణ స్వీకారం పట్టిన సర్పంచులు మాత్రమే పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. మహిళా సర్పంచుల స్థానంలో వారి వారి కుటుంబ సభ్యులు, అధికార, విపక్ష పార్టీ శ్రేణులు, నాయకులు, తదితరులు తాజాగా ఎన్నికైన సర్పంచులకు బదులుగా ఇతరులు.. ప్రోటోకాల్ ను ఉల్లంఘించి ప్రారంభోత్సవాలు చేపడితే ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులపై శాఖా పరమైన చర్యలు చేపట్టేందుకు జిల్లా పంచాయతీరాజ్ శాఖాధికారులకు నివేదికలు పంపనట్లు పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ప్రోటోకాల్ ను ఉల్లంఘించిన ప్రజా ప్రతినిధులు, కార్యదర్శులపై శాఖపరమైన చర్యలు తప్పవని ఎంపీడీవో హెచ్చరించారు. మండలంలోని 38 గ్రామ పంచాయతీల సర్పంచులు తప్పనిసరిగా నియమావళిని అనుసరించాలని ఆదేశించారు.

# కార్మిక వ్యతిరేక విధానాలపై గళమెత్తుదాం

**ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు భాగి కృష్ణయ్య**



జడ్చర్ల, ఫిబ్రవరి 10 (జనంసాక్షి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి కార్మిక లోకం సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు భాగి కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఈనెల 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కార్మికులకు కరపత్రాలు, బుక్‌లెట్లు పంపిణీ చేశారు. అన్ని రంగాల కార్మికులు ఈ సమ్మెలో ఉధృతంగా పాల్గొని కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిని నిలదీయాలని కృష్ణయ్య కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ప్రతి కార్మికుడికి కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగిస్తూ పని దినాలు, వేతనాలు పెంచాలని పట్టుబట్టారు. ఈ పోరాటంలో రైతు కూలీలు, రైతులు కూడా పెద్ద ఎత్తున పాల్గొని సంఘీభావాన్ని ప్రకటించాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఆకుల వెంకటేష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులంతా ఈ సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని, హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడుతామని ప్రకటించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు తెలుగు సత్తయ్య, మున్సిపల్ సంఘం నాయకులు కృష్ణ, మహేష్, అరుణ్ కుమార్, ప్రవీణ్, ఇందిరా, అంజమ్మ, దేవయ్య పాల్గొన్నారు.

# డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్





సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 10 (జనం సాక్షి)
జిల్లాలో ఈనెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను, స్టాంగ్ రూమ్ లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి. ప్రావీణ్యసందర్శించారు. మంగళవారం కలెక్టర్ కోహిర్, సదాశివపేట లలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరును క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో పోలింగ్ సిబ్బందికి తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు,ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేసారు. పీ.ఓ, ఓ.పీ.ఓలతో కూడిన బృందాలన్నీ హాజరయ్యారా లేదా అని కలెక్టర్ ఆరా తీయడంతో పాటు హాజరు నివేదికను పరిశీలించారు. ఎన్నికల పోలింగ్ సామాగ్రిని, బ్యాలెట్ బాక్స్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...
ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు.
చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పోలింగ్ అధికారులు పరిశీలించుకోవాలని పోలింగ్ బృందాలకు కలెక్టర్ సూచించారు.
పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులకు ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆర్ఓలకు సూచించారు. అనంతరం ఆయా మున్సిపాలిటీలకు సంబంధించిన స్ట్రాంగ్ రూములను పరిశీలించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట రెవిన్యూ డివిజనల్ అధికారి దేవుజా, మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్ తదితరులు ఉన్నారు.

# సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్



రాయికోడు, ఫిబ్రవరి 10,(జనం సాక్షి) మండలకేంద్రమైన రాయికోడ్ లోని ప్రధాన రహదారి నుండి ప్రాథమికోన్నత పాఠశాల మీదుగా అంగన్వాడీ కేంద్రం,ఉర్దూ మీడియం పాఠశాల హనుమాన్ మందిర్ వరకు ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద 25 లక్షల నిధులతో మంజూరు అయిన సీసీ రోడ్డు పనులను మంగళవారం మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర రెడ్డి,వైస్ చైర్మన్ వినయ్, ఎంపీడీఓ ఎంఎం షరీఫ్ సర్పంచ్ రాధా తుకారం పూజాకార్యక్రమాలు నిర్వహించి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.
ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధి లో భాగంగా రాయికోడ్ లో సీసీ రోడ్డును మంజూరు అయ్యేందుకు కృషి చేసిన మంత్రి దామోదర రాజనర్సింహ కు కృతజ్ఞతలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో వీరభద్రేశ్వర ఆలయ చైర్మన్ కులకర్ణి ప్రభాకర్ రావు(సతీష్), వైస్ చైర్మన్ గువ్వ భీమన్న, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు కేదరినాథ్ పాటిల్,యేసయ్య,రాయికోడ్,ఉప సర్పంచ్ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి శివశంకర్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ల, ప్రజాప్రతినిధులు,నాయకులు,కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బాలాజీ నర్సింలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# డిసిసి బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు

రాయికోడు, ఫిబ్రవరి 10,(జనం సాక్షి) మండల పరిధిలోని మాందాపూర్ గ్రామంలో సర్పంచ్ అశ్విని సంగమేశ్వర్ పాటిల్ సమక్షంలో డిసిసి బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల కార్యక్రమాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా బ్యాంకు లో పొదుపు చేయడం, సామాజిక భద్రత పథకాల అమలు పై ఫీల్డ్ ఆఫీసర్ రాములు ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకు సేవలను సద్వినియోపరుచుకోవాలని ఇతర బ్యాంకుల కన్నా తమ బ్యాంకు లోనే పొదుపు డిపాజిట్ చేసుకోవాలని ఆయన సూచించారు. ఇతర బ్యాంకుల కన్నా డీసీసి బ్యాంక్ డిపాజిట్ దారులకు అధిక వడ్డీ చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, గ్రామస్తులు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

# రామ్ తీర్థంలో ఉచిత పశువైద్య శిబిరం



న్యాల్ కల్, ఫిబ్రవరి 10, (జనం సాక్షి) : జిల్లా పశుగణాభివృద్ధి, పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో మండలంలోని రామ్ తీర్థం గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్ గణేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. పాడి రైతు తప్పనిసరిగా పశువులు రోగాల బారిన పడకుండా చికిత్సల కంటే రోగాల బారిన పడకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టడం ఎంతో ప్రయోజనకరమని వైద్యాధికారి రైతులకు సూచించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ మేరకు 18 పాడి పశువులకు గర్భిణీ టీకాలు, 80 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, 8 పశువులకు సాధారణ చికిత్సలు చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ లక్ష్మమ్మ, తుక్కారెడ్డి, రమేష్, శ్రీనివాస్, జనార్దన్ రెడ్డి, హుస్సేని, నాగప్ప, తదితరులు పాల్గొన్నారు.

# మక్తల్ మున్సిపాలిటీ ఆరో వార్డు అభ్యర్థి ఆత్మహత్య

**ఎన్నిక రద్దు చేసిన ఈసీ**

మక్తల్, ఫిబ్రవరి 10 (జనంసాక్షి)
మక్తల్ మున్సిపాలిటీ 6వ వార్డు ఎన్నికలను వాయిదా వేసినట్లుగా రిటర్నింగ్ అధికారి శివయ్య ప్రకటించారు. ఆరో వార్డు నుంచి భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా పోటీలో ఉన్న మహదేవప్ప ఆత్మహత్య చేసుకోవడంతో మున్సిపల్ ఎన్నికల నియమావళి ప్రకారం ఎన్నికను వాయిదా వేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు మరిన్ని వివరాలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్వరలోనే వెల్లడిస్తామని రిటర్నింగ్ అధికారి లిఖితపూర్వకంగా ఉత్తర్వులు విడుదల చేశారు.



# కార్యకర్తలకు అండగా ఉంటా

## ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

## కురుమూర్తిని పరామర్శించిన ఎమ్మెల్యే

జడ్చర్ల, ఫిబ్రవరి 10 (జనంసాక్షి): పార్టీ శ్రేణులకు ఏ ఆపద వచ్చినా, కష్టం వచ్చినా నేనున్నానంటూ జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి భరోసా ఇచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని పాత బజార్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కురుమూర్తిని జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో కురుమూర్తి గాయపడి, చికిత్స అనంతరం ప్రస్తుతం తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మంగళవారం కురుమూర్తి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, అధైర్యపడవద్దని పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నిరంతరం ప్రజల కోసం శ్రమించే కార్యకర్తలే పార్టీకి బలమని, వారి క్షేమం తనకు ముఖ్యమని పేర్కొన్నారు. కురుమూర్తి త్వరగా కోలుకొని ప్రజా సేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు ధృవ, అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకునిపై బిఆర్ఎస్ నాయకుల దాడి

## 9వ వార్డులో తీవ్ర ఉద్రిక్త

## బాధితులు పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

జనంసాక్షి ఫిబ్రవరి10 నర్సాపూర్
నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు చైతన్యపురి కాలనీలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సోమవారం అర్ధరాత్రి కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్యన ఘర్షణ నెలకొనగా, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య మాట మాట పెరగడంతో వివాదానికి దారి తీసింది. అయితే కాంగ్రెస్ నాయకుడు నరహరి అనే వ్యక్తిపై కొందరు బిఆర్ఎస్ నాయకులు దాడి చేసి తనను గాయపరిచారని బాధితుడు నరహరి తెలిపారు. ఈవిషయం తెలుసుకున్న 9 వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి పైడి శ్రీధర్ గుప్త, శివ్వంపేట మాజీ పీఎస్‌-ఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి ఇతర కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఉదయం బాధితుడి ఇంటికి వెళ్లి పరమర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులు 9వ వార్డులో ఓడిపోతామన్న భయంతోనే 9వ వార్డుకు చెందిన కాంగ్రెస్ నాయకులపై దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. వెంటనే పోలీసులు కలగజేసుకొని కాంగ్రెస్ నాయకుడి పై దాడి చేసిన బిఆర్ఎస్ నాయకుల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.



# సదాశివపేటలో పోలింగ్ కేంద్రాల పరిశీలన

## ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ప్రావిణ్య క్షేత్రస్థాయి తనిఖీ

సదాశివపేట ఫిబ్రవరి 10(జనం సాక్షి) పురపాలక సంఘ ఎన్నికల నేపథ్యంలో సదాశివపేట పట్టణంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ప్రావిణ్య సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తీసుకోవాల్సిన ఏర్పాట్లపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, ఓటర్లకు అవసరమైన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణీలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు వంటి వసతులు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ రోజున ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం తలెత్తకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ ప్రావిణ్య స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో శాంతిభద్రతలు కాపాడేందుకు పోలీస్ శాఖ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా అమలవుతుందని, ఎక్కడైనా ఉల్లంఘనలు జరిగితే కఠిన చర్యలు తప్పవని



హెచ్చరించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, మున్సిపల్ అధికారులు, పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యుత్ అందించడమే 'ప్రజాబాట' లక్ష్యం

**– సర్పంచ్ కొమ్ము రవి, విద్యుత్ ఏఈ కనకయ్య**



చేర్యాల (జనంసాక్షి) ఫిబ్రవరి 10 : నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే ప్రజా బాట లక్ష్యమని ఆకునూరు గ్రామ సర్పంచ్ కొమ్ము రవి, చేర్యాల విద్యుత్ రూరల్ ఏఈ కనకయ్య అన్నారు. మంగళవారం ఆకునూరులో నిర్వహించిన ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా పలు విద్యుత్ నియంత్రికలు, స్తంభాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం లేకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ప్రతి మంగళ, గురు, శనివారాల్లో తమ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి విద్యుత్ సమస్యలను తెలుసుకుంటారన్నారు. వెంటనే స్పందించి లోఓల్టేజ్ లో భాగంగా బీసీ కాలనీ, ఖచ్చిరు వద్ద 25కేవీ రెండు నియంత్రికలు ఏర్పాటు చేసి లోఓల్టేజ్ సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ కర్నాల సంపత్, ఉప సర్పంచ్ కడారి పల్లవి భాస్కర్, వార్డు సభ్యులు నూనె శేఖర్, ఎండి హైమద్, జూపల్లి కార్తీక్ రెడ్డి, అందె లక్ష్మి, సూర అనిత, తాడికొండ శేఖర్ యాదవ్, భూమని భాస్కర్, సుంచు హేమ, గణపురం బాల నర్సమ్మ, మంతపురి భాగ్యలక్ష్మి, గ్రామస్తులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# మక్తల్‌లో కౌన్సిలర్ అభ్యర్థి ఆత్మహత్య బాధాకరం



## బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్ రాజేందర్ రెడ్డి

నారాయణపేట జిల్లా బ్యూరో ఫిబ్రవరి 10 (జనం సాక్షి): నారాయణపేట మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ చైర్ పర్సన్ అభ్యర్థిని ఏ నిబంధనల కింద ఆ వ్యక్తికి ఏ పదవి ఉందో ప్రజాస్వామ్య బద్ధం గా ప్రజల చేత ఎన్నుకోబడిన కౌన్సిలర్ అభ్యర్థులు చైర్మన్ ఎన్నుకుంటారని దీనికి భిన్నంగా నారాయణ పేట మున్సిపాలిటీలో ఏ పదవి ఆయనకు లేకున్నా చైర్ పర్సన్ పదవిని ఐదు కోట్లకు అమ్ముకున్నట్లు పట్టణంలో ప్రజలు జోరుగా ప్రచారం జరుగుతుందని బి ఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం నాడు టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నారాయణ పేట పట్టణంలో బుధవారం నాడు జరిగే మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసే అవకాశం ఉందని ఓటర్లు ప్రజాస్వామ్యహితంగా ఓటును వినియోగించుకునేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా మౌలిక వసతులను కల్పించవలసిన అవసరం జిల్లా యంత్రాంగానికి ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ఈరోజు ఉదయం మక్తల్ లో బిజెపి అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడం బాధా కరమని అధికార పార్టీ భయభ్రాంతులకు భయపడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన భార్య ఆరోపించారని ఆయన అన్నారు. నారాయణపేట మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిన పోలీసులే బాధ్యత వహించాలని ఆయన అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ అత్యంత దుర్మార్గంగా వ్యవహరించడం సరైంది కాదని ఆయన అన్నారు. అధికార పార్టీ నాయకులకు రాజ్యాంగబద్ధంగా మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిని ఎలా ఎన్నుకోవాలో తెలియని పరిస్థితి కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో నెలకొందని రాజ్యాంగం తెలియకుంటే తెలుసుకొని ప్రవర్తించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అధికార పార్టీలో ఏ పదవిలో లేకుండా ప్రజలకు హామీలు ఇవ్వడం ఎంతవరకు అలాంటి వ్యక్తులను పట్టణ ప్రజలు ఓటర్లు నమ్మవద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి ఎన్నికల అబ్జర్వర్ మాజీ ఎంపీపీ అమ్మ కోళ్ల శ్రీనివాస్ రెడ్డి పట్టణ అధ్యక్షులు సాగర్ సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తాళం వేసున్న ఇండ్లకే టార్గెట్ చేసిన దుండగులు

ఇండ్ల తలుపుల గొలుసులు, తాళాలను పగలగొట్టి ఇళ్లల్లోకి చొరబడ్డారు. బోయిని లక్ష్మి ఇంట్లోని బీరువాను పగలగొట్టి సామాగ్రిని చిందర, వందర చేసి రూ:19 వేలను దొంగలించారని బాధితురాలు తెలిపారు. పలు వస్తువులు, పెట్టెలను దొంగలించి సమీపానగల వ్యవ సాయ పొలంలో పారవేసి పారిపోయారని తెలిపారు. తాళం వేసి ఉన్న వెంకటరెడ్డి ఇంటి తలుపు గొలుసులు, తాళాలను పగలగొట్టి ఇళ్లల్లోకి చొరబడి అర తులం బంగారంతో పరారయ్యారు. వస్తువులను చిందరవందర చేశారు. వీరారెడ్డి ఇంటి తలుపుల గొలుసులు, తాళాలను పగులగొట్టి రూ:16 నగదు, నాలుగు మాసాల బంగారం రింగు, తులంనర నల్ల ముత్యాల బంగారు ఆభరణాన్ని దొంగలించారని బాధితుడు తెలిపారు. మంగలి గుండన్న, మాల వెంకట్ ల ఇండ్ల తలుపుల గొలుసులు, తాళాలను పగలగొట్టి ఇళ్లల్లోకి చొరబడ్డారు. నగదు, బంగారు, ఇతర వస్తువులు ఏమి లభించక పోవడంతో వస్తువులను చిందర వందరగా పారవేసి పారిపోయారని బాధితులు తెలిపారు. ఈ మేరకు బాధితులు స్థానిక హద్దునూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**ఒకే గ్రామంలో.. ఒకే రోజు 5 చోట్ల**

దొంగతనాలు జరిగిన సంఘటన విషయాన్ని తెలుసుకున్న స్థానిక పోలీసులు మంగళవారం విచారణ చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు.. జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు సమాచారంతో.. సంగారెడ్డి జిల్లా క్లూస్ టీం సీఐ నాగేశ్వరరావు, పోలీస్ సిబ్బంది, స్థానిక పోలీస్ ల సిబ్బంది విచారణ చేపట్టారు. చోరీ జరిగిన గ్రామంలోని బాధిత కుటుంబాలు, స్థానికులతో కలిసి విచారణ చేపట్టారు. దాదాపు రెండున్నర గంటల పాటు పలు కోణాల్లో విచారణ చేపట్టారు. చోరీలు జరిగిన పలు ప్రధాన రోడ్లు, ఇండ్ల సమీపాన సీసీ కెమెరాల ఏర్పాటు చేసి ఉంటే దుండగులను త్వరలోనే పట్టుకునే అవకాశం మరింతగా అధికంగా ఉండేదని స్థానికులు ఆశాభవాన్ని వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి స్థానిక పోలీసులు విచారణ చేపడుతున్నారు.



# డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్

నారాయణపేట జిల్లా బ్యూరో పిబ్రవరి10(జనం సాక్షి):మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట వద్ద గల గురుకుల బాలికల పాఠశాల /కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను మంగళ వారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు.ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు. సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి




బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే ఆర్వో, స్పెషల్ ఆఫీసర్ దృష్టికి తేవాలని సూచించారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాళ్ళను సైతం పరిశీలించిన కలెక్టర్, సీ.సీ టీవీలు ఏర్పాటు చేయాలని, ఒక్క సెకను కూడా విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనవసర తప్పిదాలకు తావిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎంతో అప్రమత్తతో ఎన్నికల విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రామచందర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, మాస్టర్ ట్రైనర్, ఆర్వోలు,తదితరులు పాల్గొన్నారు.



## జాతీయస్థాయి షూటింగ్ బాల్ క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

మక్తల్, ఫిబ్రవరి 10 (జనంసాక్షి) : ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7 నుండి 9 వరకు తిరుపతి ఆర్ట్స్ కళాశాలలో జరిగిన 35వ సౌత్ జోన్ షూటింగ్ బాల్ జాతీయస్థాయి జూనియర్, సీనియర్ మహిళల పోటీలలో తెలంగాణ షూటింగ్ బాల్ సీనియర్ మహిళా జట్టులో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుండి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. గోపాలం ఆధ్వర్యంలో అసమాన క్రీడా నైపుణ్యతను ప్రదర్శించి తెలంగాణ జట్టు గెలుపునకు ప్రధాన పాత్ర పోషించి, జాతీయస్థాయిలో షూటింగ్ బాల్ క్రీడల్లో ప్రథమ స్థానం సంపాదించి ట్రోఫీ, బంగారు పథకాలు, మెరిట్ సర్టిఫికెట్స్ పొందినట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోచ్ బి.గోపాలం తెలిపారు. అలాగే జూనియర్ బాలికల విభాగమున ఏ. స్రవంతి( ఉప్పల్ పాడు), జి. దివ్య (మానాజీపేట) బి. స్వాతి (కోయిల్ కొండ) తెలంగాణ జట్టు తరుపున ఆడి తెలంగాణ జట్టు మూడో స్థానం పొందుటకు చక్కని పాత్ర పోషించి కాంస్య పథకాలు, మెరిట్ సర్టిఫికెట్లు ఏపీ ప్రధాన కార్యదర్శి పరుశరాముడు, తెలంగాణ ప్రధాన కార్యదర్శి ఐలయ్య, ఉపాధ్యక్షుడు బి .గోపాలం ద్వారా మెడల్స్ ను, సర్టిఫికెట్స్ ను పొందినట్లు బి.గోపాలం తెలిపారు. జాతీయస్థాయి షూటింగ్ బాల్ క్రీడల్లో ప్రథమ స్థానం, తృతీయ స్థానం పొందిన మహిళలను, బాలికలను రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం, ప్రధాన కార్యదర్శి సిహెచ్. ఐలయ్య, వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు ఏ. అడమ్స్, బి. పుష్ప పిఈటి, తాన్ సింగ్, పీఈటిలు రమేష్, రాములు, అంజి, చంద్రమోహన్, మంజునాథ్, పిడి రజిని, లావణ్య, రమ్య, అవంతి అభినందించారు.

## మున్సిపల్ ఎన్నికలకు పటిష్టమైన పోలీసు భద్రత


### జిల్లా ఎస్పీ సునిత రెడ్డి

వనపర్తి బ్యూరో ఫిబ్రవరి11 జనంసాక్షి

వనపర్తి జిల్లాలోని 5- మున్సిపాలిటీలలో ఎన్నికలు జరగనున్నాయని, ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అత్యంత పటిష్టమైన భద్రత ప్రణాళికను అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, తెలిపారు. అదనపు ఎస్పీ, డిస్పీలు ప్రత్యేక పోలీసు బృందాలు అప్రమత్తంగా పనిచేస్తున్నాయని, ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛయుత ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజలు ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలని, ఆయా మున్సిపాలిటీలలో ఎన్నికల ప్రవర్తన నియమావళి కఠినంగా అమలు చేయడం జరుగుతుంది ఆమె అన్నారు. 5- మున్సిపాలిటీలలో 80-వార్డులకు గానూ 191-కేంద్రాలు, జరుగనున్నాయని అన్నారు. ఇందులో 67-సమస్యాత్మక పోలింగ్ స్టేషన్స్ గుర్తించి ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా



ఎస్పీ మాట్లాడుతూ... మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల భద్రత అనేది సమష్టి బాధ్యతని,విధుల్లో ఉన్న సిబ్బంది ప్రతి నిమిషం జిల్లావ్యాప్తంగా పోలీసుల కఠిన పర్యవేక్షణ కొనసాగుతుందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా,జిల్లా వ్యాప్తంగా 1000 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పూర్తి రక్షణతో పాటు 163 బి ఎన్ ఎస్ ఎస్ (144 సెక్షన్) ను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.



## కిష్టాపూర్‌లో లభ్యమైన కొత్త రాతి చిత్రాలు

మెదక్, ఫిబ్రవరి 10(జనం సాక్షి): కొత్త రాతిచిత్రాలతావును గుర్తించిన కొత్త తెలంగాణచరిత్రబృందం పరిశోధకుడు కొత్త తెలంగాణచరిత్రబృందం సభ్యుడు మచ్చ ప్రణయ్ కుమార్ అన్వేషణలో మెదక్ జిల్లా కొల్చారం మండలం కిష్టాపురం గ్రామం బయట కొత్త రాతిచిత్రాల తావు వెలుగుచూసింది. 17ఁ99'95.8"ల ఉత్తర అక్షాంశాలు, 78ఁ21'22.7" తూర్పురేఖాంశాలమీద ఉన్న ఈ రాతిచిత్రాలతావులో ఎరుపురంగు నింపిన 5 పెద్దకొమ్ముల ఎనుబోతుల బొమ్మలు చిత్రించబడ్డాయి. మరికొన్ని రంగుకొల్పోయి గుర్తుపట్టరానివిధంగా వున్నాయి. ఈ తావులో కొన్ని సూక్ష్మరాతి (మైక్రోలిథ్స్)పనిముట్లు లభించాయి.

ఈ రాతిచిత్రాలు కోకాపేట, గుండ్ల పోచంపల్లి తావులలో రాతిచిత్రాలలోని ఎనుబోతులను పోలివున్నాయని, మైక్రోలిథ్స్ ఆ తావుననే లభించడంవల్ల వీటిని మీసోలిథిక్ పీరియడ్ అంటే ప్రస్తుతానికి 10వేల యేండ్ల కిందటివని నిర్ధారించవచ్చునని రాతిచిత్రాలనిపుణులు, కొత్త తెలంగాణచరిత్రబృందం సలహాదారులు డా. బండి మురళీధర్ రెడ్డి, చరిత్రబృందం కన్వీనర్ రామోజు హరగోపాల్ అన్నారు.

## రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే జిఎంఆర్

పటాన్చెరు ఫిబ్రవరి10 (జనంసాక్షి) పటాన్చెరు డివిజన్ పరిధిలోని గోకుల్ నగర్ లో శ్రీ రామలింగేశ్వర స్వామి ఐదవ వార్షికోత్సవ కార్యక్రమానికి పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, సీనియర్ నాయకులు దేవయ్య, మల్లేష్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు, పుర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.



# గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని సన్మానించిన మాజీ మంత్రి



వనపర్తి బ్యూరో ఫిబ్రవరి 10 జనంసాక్షి

వనపర్తి 32వ వార్డుకు చెందిన మెకానిక్ వెంకటేశ్వర్లు కూతురు వి.వైష్ణవి ఇటీవల ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ నుండి అగ్రికల్చర్ ఎం.ఎస్సీ ఎకనామిక్స్ నుండి గోల్డ్ మెడల్ సాధించింది. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వారి స్వగృహంలో వైష్ణవినీ సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమములో గట్టు యాదవ్,కురుమూర్తి యాదవ్,నందిమల్ల.అశోక్, గంధం.బాలపేరు,నాగన్నయాదవ్,వేణుగోపాల్,చిలుక.సత్యం, బొబ్బిలి.ప్రేమ్ కుమార్,సయ్యద్.జెమిల్ తదితరులు పాల్గొన్నారు.

**పార్థివ దేహానికి నివాళులు అర్పించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

పెబ్బేరు పట్టణంలో 12 వార్డు చెందిన చింతల మన్యం ,గత వారం రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదం వల్ల,సోమవారంతుది శ్వాస విడిచారు.మంగళవారం పట్టణానికి వెళ్లి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించి వారి కుటుంబానికి



ప్రగాఢ సానుభూతి తెలియజేసి మనో ధైర్యాన్ని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఇచ్చారు. మాజీ మంత్రి వెంట పట్టణ పార్టీ అధ్యక్షులు దిలీప్ కుమార్ రెడ్డి, హేమంత్ ముదిరాజ్, సయ్యద్ జమీల్, చిట్యాల రాము, గాలిగల్ల.క్రాంతి కుమార్, నాయకులు పాల్గొన్నారు.

## ఆలోచించి ఓటు వేయాలి

– మండల సర్పంచుల సంఘం అధ్యక్షురాలు వడ్త్యావత్ భాగ్యమ్మ పుల్ సింగ్



వెల్దండ ఫిబ్రవరి 10 (జనంసాక్షి) : నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి మున్సిపాలిటీలో జరిగే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించాలని మండల సర్పంచుల సంఘం మండల అధ్యక్షురాలు వడ్త్యావత్ భాగ్యమ్మ పుల్ సింగ్ లు పేర్కొన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధికారంలో నల్లమల్ల ప్రాంత ముద్దుబిడ్డ రేవంత్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి కావడంతో మున్సిపాలిటీకి నిధుల వరద వస్తుందని పట్టణ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి సేవ చేసే భాగ్యం కల్పించాలని విజ్ఞప్తిచేశారు. ప్రజాసంక్షేమమేధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జంబూల శ్రీకాంత్, శ్రీశైలం, దేశ్య నాయక్,చంద్యా నాయక్, పుల్ సింగ్, రంజిత్ నాయక్, డాక్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటమి భయంతోనే జిల్లాల రద్దు ప్రకటన

– బిఆర్ఎస్ మండల యువ నాయకుడు పోలే అశోక్



వెల్దండ ఫిబ్రవరి 10 (జనంసాక్షి) : మున్సిపల్ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలను పునర్విభజన చేస్తామని చెప్పడం విడ్డురంగా ఉందని మండల బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు పోలే అశోక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాల రద్దు, కొత్త జిల్లాల ఏర్పాటు ఉండదని చెబుతూనే అవసరమైతే అసెంబ్లీలో చర్చిస్తామని చెప్పడం రెండు నాలికల ధోరణి విధానానికి నిదర్శనమని ఆయన అన్నారు. పునర్విభజన లేదని తేల్చేసిన తర్వాత అసెంబ్లీలో చర్చ అవసరం ఏమిటని ప్రశ్నించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే జిల్లాల ప్రకటనపై స్పష్టమైన వైఖరిని తెలిపి లిక్వల్కుర్తిని జిల్లా కేంద్రంగా ప్రకటించాలనిలి డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే సీఎం అస్పష్టమైన ప్రకటనలు చేసి ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. అయితే తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం సగం వికారాబాద్ జిల్లాలో ఉండడంతో, తన నియోజకవర్గ ప్రయోజనాల కోసం జిల్లాలో విభజన అంశాన్ని తెరపైకి తెచ్చారని అన్నారు.

## గర్భకోశ వ్యాధి నివారణ పరీక్షలు

మిడ్జిల్. ఫిబ్రవరి 10 (జనం సాక్షి) మండలంలోని వాడ్యాల గ్రామపంచాయతీ లో ఉచిత పశువైద్య శిబిరంలో భాగంగా మంగళవారం వెటర్నరీ డాక్టర్ శివరాజ్ ఆధ్వర్యంలో పశువులకు గర్భకోశ వ్యాధుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పశు వైద్య-పశు సంవర్ధక శాఖ. పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా నిర్వహించి పాడియావులకు. దూడలకు. పరీక్షలు. నిర్వహించారు. అదేవిధంగా పాడి అభివృద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. పశువులకు అవసరమైన మందులను సరఫరా చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చంద్రయ్య గౌడ్. ఉపసర్పంచ్ నాగరాజు. వార్డ్ సభ్యులు. బిఆర్ఎస్ మండల నాయకులు. రైతులు. వెటర్నరీ. వైద్య సిబ్బంది. పాల్గొన్నారు.



# సెలవు రోజు అని ఓటు వేయకుండా ఇతర పనులకు వెళ్లొద్దు

**తప్పని సరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలి**
**గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 90 శాతం పోలింగ్ నమోదు అయింది**
**మున్సిపాలిటీలలో 100 శాతం ఓటింగ్ నమోదు కావాలి**
**జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ రాహుల్ రాజ్**



మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 10 (జనం సాక్షి): సెలవు రోజు అని ఇతర పనులకు వెళ్లకుండా మున్సిపాలిటీలో ఉన్న ప్రజలందరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి ,జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్ లో మాట్లాడుతూ.. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో ఫిబ్రవరి 11న ఉదయం 7 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగు అన్ని ఏర్పాట్లు చేశామని, ప్రజలందరూ పెద్ద ఎత్తున ఓటింగ్లో పాల్గొని 100% ఓటింగ్ను నమోదు చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దేశంలో బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థ, బలమైన రాజ్యాంగం ఉన్నందున దేశ ప్రధానమంత్రి కైనా.. సామాన్య వ్యక్తికైనా ఒకే ఒక ఓటు హక్కును కల్పించిందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీ ,వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి భయం గాని ,పక్షపాతం గాని, రాగద్వేషాలు గాని ,ప్రలోభాలకు లోను కాకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అత్యంత పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో 90 శాతం ఓటింగ్ నమోదయిందని, మున్సిపాలిటీలలో 100% ఓటింగ్ నమోదు కావాలని కోరారు.

# ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరగాలి



**ఒత్తిడి బెదిరింపులకు పాల్పడే నైజం మాది కాదు**
**విచారణలో వాస్తవాలు బయటకు వస్తాయి**
**మృతుడి కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్న మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి**

మక్తల్, ఫిబ్రవరి 10 (జనంసాక్షి) నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపల్ ఎన్నికల్లో 6వ వార్డు నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీలో ఉండి ఆత్మహత్యకు పాల్పడ్డ ఎరుకలి మహాదేవ్ సంఘటనపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇతరులపై ఒత్తిడి తేవడం బెదిరింపులకు పాల్పడే చర్యలకు కాంగ్రెస్ పాల్పడదని ఇది కాంగ్రెస్ పార్టీ నైజం అంతకన్నా కాదని అన్నారు. మంగళవారం మక్తల్ లో క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఎరుకలి మహాదేవ్ ఆత్మహత్య పై విచారణ వ్యక్తం చేస్తూ కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. రకరకాల ఆరోపణలు బయటకు వస్తున్నాయని వాస్తవం ఏంటి అన్నది తేలాల్సి ఉందని అన్నారు. విషయం తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. ఎరుకలి మహాదేవ్ ఆత్మహత్యకు పాల్పడడం పట్ల తీవ్ర విచార వ్యక్తం చేస్తూ ఈ సంఘటన తనను ఆందోళనకు గురి చేసిందన్నారు. ఎన్నికల్లో పోటీ చేయడం గెలుపు ఓటమి సహజంగా జరుగుతూనే ఉంటాయన్నారు. బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నట్లు ఙకాంగ్రెస్ పార్టీ నాయకులు కానీ ఎవరు కూడా ఏ ఒక్కరిపై ఒత్తిడి తేవడం బెదిరింపులకు పాల్పడడం లేదని చెప్పారు. ఒక వ్యక్తిపై ఒత్తిడి చేయడం బెదిరింపులకు దిగాల్సిన కర్మ తనకు పట్టలేదని అన్నారు. వాస్తవంగా బిజెపి అభ్యర్థిగా పోటీ చేసిన మహాదేవ్ అంతకుముందు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తనేనని మంత్రి గుర్తు చేశారు శనాయకుల బెదిరింపుల వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని గుండెపోటు వల్ల మరణించాడని మంత్రి బెదిరించాడని ఇలా రకరకాల ఆరోపణలు బయటకు రావడం బిజెపి నాయకులు నిందలు మోపడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఒకరిని బెదిరించాల్సిన అవసరం ఎంత మాత్రం లేదని చెప్పారు. ఈ క్షణం వరకు మృతుడు మహాదేవును ప్రత్యక్షంగా చూడలేదన్నారు. చనిపోయాక వాట్స్అప్లో ఫోటోలు వచ్చినప్పుడు మాత్రమే చూశానని ఏ రోజు కూడా కనీసం ఫోన్ లో కూడా మాట్లాడలేదని ఒకవేళ ఆ విధంగా మాట్లాడి ఉంటే బెదిరింపులకు పాల్పడినట్లు తెలిస్తే చట్టరీత్యా ఏ చర్యల కన్నా సిద్ధమని అన్నారు కానీ రాజకీయ లబ్ది పొందేందుకు బిజెపి నాయకులు ఇలాంటి చీప్ పాలిటిక్స్ ప్లే చేయడం మానుకోవాలని అన్నారు. గతంలోనూ నర్వలో ఇలాంటి చర్యలకు పూనుకోవడం నిజాలు బయటికి రావడంతో వెనుక తగ్గాలని అన్నారు. మళ్లీ ఇక్కడ అనవసరంగా నాపై నా పార్టీపై నిందలు మోపడం మానుకోవాలని అన్నారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరపాలని అధికారులను కోరుతున్నానని చెప్పారు. వాస్తవాలు బయటికి వస్తాయని అప్పుడు ఎవరు బాధ్యులో తేలుతుందన్నారు. ఒకవేళ నా ప్రమేయం ఏమాత్రం ఉంటే ఏ శిక్షకైనా సిద్ధమైనది రాజ్యాంగంగానికి తానేమి అతీతుడను కానని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఇకనుంచి అయినా బిజెపి నాయకులు ఇలాంటి ఆరోపణలకు దిగడం మానుకోవాలని కోరారు. ఈ విలేఖరుల సమావేశంలో బికేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గవినోళ్ల బాలకృష్ణ రెడ్డి, జి.రవికుమార్ యాదవ్,కోళ్ళ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల వేళ తీవ్ర విషాదం

ఒత్తిడి గురై ఆత్మహత్య చేసుకుని మృతి చెందడం తీవ్ర విషాదం నింపింది. ఈ సంఘటన విషయం తెలిసిన వెంటనే బీజేపీ రాష్ట్ర నాయకులు కొండయ్య, నాయకులు జి.బలరాం రెడ్డి, బి. రాజశేఖర్ రెడ్డి, బాల్చేడ్ మల్లికార్జున్, కర్ని స్వామి, దేవరింటి నర్సింహారెడ్డి, జయానందన్ రెడ్డి తదితరులు ఘటన స్థలానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పడం కాకుండా ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈ సంఘటన పై సమగ్ర విచారణ జరిపి నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

**మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, రామచంద్ర రావు ఎంపీ డీకే అరుణ**

మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు నుండి బిజెపి అభ్యర్థిగా బరిలో నిలిచిన ఎరుకలి మహాదేవ్ ఆత్మహత్యపై రామచంద్ర రావు మాట్లాడుతూ... మృతుడి భార్య స్టేట్మెంట్ ఆధారంగానే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు డిమాండ్ చేశారు. పోలీసులు రూపొందించిన ఎఫ్ఐఆర్ ను మార్చాలని అప్పటివరకు పోస్ట్ మార్టం జరిగేది లేదని ఆయన స్పష్టం చేశారు. పోలీసులు ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేయాలి తప్ప ముఖ్యమంత్రి, మంత్రి చెప్పిన విధంగా కాంగ్రెస్ కార్యకర్తల్లా పనిచేయవద్దని హితవు పలికారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయడం పోలీసుల బాధ్యత అన్నారు. మంగళవారం 6వ వార్డు కౌన్సిలర్ గా పోటీ చేసి ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటనపై స్పందించిన ఆయన, డికె. అరుణతో కలిసి మక్తల్ ప్రభుత్వాసుపత్రిలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ స్థానిక మంత్రి కాంగ్రెస్ నాయకులు బెదిరింపులకు పాల్పడడం వల్లే మానసికంగా కృంగి ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. ఈ సంఘటనపై పార్లమెంటు సభ్యులు డీకే అరుణ ఎన్నికల కమిషన్తో మాట్లాడుతుందని హ్యూమన్ రైట్స్ కమిషన్ కూడా మక్తల్ రానున్నట్లు ఆయన తెలిపారు. సంఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర పార్టీ మృతుని కుటుంబానికి అండగా ఉంటుందని చెప్పారు. 10 లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందించనున్నట్లు రామచంద్రరావు ప్రకటించారు.

# గుండాల శివరాత్రి వేడుకల ఆహ్వాన పత్రిక

## కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి అందజేత



వెల్దండ ఫిబ్రవరి 10 (జనంసాక్షి) : దక్షిణ కాశి శ్రీశ్రీ అంబా రామలింగేశ్వర స్వామి దేవాలయం వెల్దండ మండలం గుండాల గ్రామంలో నిర్వహించు మహాశివరాత్రి వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొనాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి మంగళవారం ఆయన నివాసంలో ఆలయ చైర్మన్ ,పూజారులు ఆహ్వాన పత్రికను అందజేశారు. శ్రీ శ్రీ అంబా రామలింగేశ్వర స్వామి కళ్యాణోత్సవ వేడుకలో పాల్గొనాలని ఆలయ కమిటీ చైర్మన్ మల్లెపల్లి సందీప్ రెడ్డి, పూజారులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మోతిలాల్ నాయ క్, మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సంజీవ్ కుమార్ యాదవ్, కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్ రెడ్డి, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, నాయకులు సురేందర్ రెడ్డి, శేఖర్, పుల్లయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు,ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు కృష్ణయ్య శర్మ, శివకుమార్ శర్మ, సురేష్ శర్మ, నరహరి శర్మ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శించుకున్న ఆలయ చైర్మన్ ప్రహ్లాద రావు



మల్దకల్ ఫిబ్రవరి 10 (జనంసాక్షి) మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి సన్నిధానంలో ఆలయ వ్యవస్థాపక వంశీయులు పట్వారి ప్రహ్లాద రావు,నందిని ప్రకాష్ రావు,చింతరేవుల దేవస్థానం దేవస్థానం వంశీయులు గిరిధర్ రావు, తాటికుంట మధుసూదన్ రెడ్డి,చంద్రశేఖర రావు, శేషదాసుల వంశిస్థులు ధీరేంద్రదాస్, బాదం శ్రీనివాసులు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.అనంతరం పెద్ద చింతరేవుల అన్నదాన ట్రస్ట్ చైర్మన్ ఆధ్య చక్రవర్తి కేశవాచార్యులు ఆధ్వర్యంలో శ్రీశైలంలోని భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. శివదీక్ష స్వాములు భక్తులు అన్న ప్రసాద పంపిణీలో 35 వేల శివ స్వాములు శివ భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

## ఆత్మహత్య ఘటన పై కేసు నమోదు : అన్ని కోణాల్లో దర్యాప్తు

**జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**



నారాయణపేట జిల్లా బ్యూరో ఫిబ్రవరి10 (జనం సాక్షి): మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 06వ వార్డు బీజేపీ అభ్యర్థి ఎరుకలి మహదేవప్ప తండ్రి ఊశప్ప) వయస్సు 44 సం. ఆత్మహత్య చెందిన ఘటనపై మృతుడి భార్య ఎరుకలి సత్యమ్మ ఫిర్యాదు మేరకు మక్తల్ పోలీస్ స్టేషన్లో 194 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసి ఈ ఘటనకు సంబంధించి నిష్పక్షపాతంగా సమగ్ర దర్యాప్తు జరిపి నిజానిజాలు వెల్లడిస్తామని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు.దర్యాప్తు పూర్తయ్యే వరకు ఎలాంటి ఊహాగానాలకు తావివ్వకుండా సహకరించాలని ప్రజలను జిల్లా ఎస్పీ కోరారు.

## పేద కుటుంబాలకు అండగా ఉంటా ..

**- సర్పంచ్ బెక్కర సునీత రాజశేఖర్ రెడ్డి**

ఉర్కొండ ఫిబ్రవరి 10 (జనం సాక్షి) పేద కుటుంబాలకు సేవ చేయడం నా అంతిమ లక్ష్యమని ఇప్ప పహాడ్ సర్పంచ్ బెక్కరి సునీత రాజశేఖర్ రెడ్డి అన్నారు. మండలంలోని ఇప్ప పహాడ్ గ్రామానికి చెందిన దుబ్బ పరుశ రాములు ఆనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఇప్పపహాడ్ గ్రామ సర్పంచ్ బెక్కర సునీత రాజశేఖర్ రెడ్డిఆ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ తక్షణ సహాయం 10000 రుపాయలు వారి కుటుంబానికి అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎన్నం విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ దుబ్బ రాములు, దుబ్బ మల్లేష్, అంతరం శివ , ఎన్నం కిషోర్ రెడ్డి, దుబ్బ రాజు, నాగరాజు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి మున్సిపాలిటీలో బిఆర్ఎస్ అభ్యర్థులను ఆశీర్వదించండి

**బిఆర్ఎస్ పార్టీ మునిసిపాలిటీ ఎన్నికల ఇన్చార్జ్ భాస్కర్ రావు**



వెల్దండ ఫిబ్రవరి 10 (జనంసాక్షి): కల్వకుర్తి మున్సిపాలిటీ ఎన్నికల ఇన్చార్జిగా వెల్దండ మండల సింగిల్ విండో మాజీ చైర్మన్ జూపల్లి భాస్కరరావు మంగళవారం ఓ ప్రకటన కల్వకుర్తి ప్రజలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో మున్సిపాలిటీ ఎన్నికల ఇన్చార్జిగా నియమించిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కల్వకుర్తి మున్సిపాలిటీ ఓటర్లందరూ.. బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న 22 వార్డుల అభ్యర్థులను ఆశీర్వదించి కారు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మనసారా వేడుకుంటున్నానని తెలిపారు.

## ఎన్నికల నేపథ్యంలో నేడు సాధారణ సెలవు

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



వనపర్తి బ్యూరో ఫిబ్రవరి 10 జనంసాక్షి ఫిబ్రవరి 11వ తేదీన మున్సిపాలిటీ ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఓటరుగా నమోదై ఉండి, ఓటు హక్కు వినియోగించుకోవాలనుకునే వారికి ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి నేడొక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని వనపర్తి, పెబ్బేరు, కొత్తకోట,ఆత్మకూరు,అమరచింత పురపాలికలకు ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ?ఈ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో, వనపర్తి జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఓటరుగా నమోదై ఉండి, ఓటు హక్కు వినియోగించుకోవాలనుకునే వారికి ఎన్నికల సంఘం సూచన మేరకు 11వ తేదీ నాడు 'ప్రత్యేక సాధారణ సెలవు' మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ?అర్హత కలిగిన ఉద్యోగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎన్నికల అధికారి ఆదర్శ్ సురభి సూచించారు.

## ప్రాక్టికల్స్‌ను పరిశీలించి.. సూచనలు చేసి

**జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి మాధవి**

పాపన్నపేట, ఫిబ్రవరి 10 (జనంసాక్షి) :



రాబోయే వార్షిక పరీక్షల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి పేర్కొన్నారు. మంగళవారం పాపన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఫిజిక్స్,కెమిస్ట్రీ ప్రాక్టికల్స్ సరళిని పరిశీలించారు. అనంతరం ఆమె విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల సూచనలతో విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షల్లో ఉత్తీర్ణులవ్వాలని సూచించారు. సిబ్బందికీ తగు సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ నర్సింలు, అధ్యాపకులు శ్రీనివాస్, ప్రవీణ్, దేవదాసు,సంధ్యారాణి తదితరులు ఉన్నారు.

## ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు

మాట్లాడుతూ పౌరులకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ఓటరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్నికలు,పారదర్శకంగా, ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ప్రతి మున్సిపాలిటీ, పోలింగ్ కేంద్రంలో గట్టి పోలీస్ భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలి



**- బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి**

మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 10 (జనం సాక్షి): మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం.పద్మ దేవేందర్ రెడ్డి అన్నారు. మెదక్ పట్టణంలో బిఆర్ఎస్ నాయకులపై జరిగిన దాడుల నేపథ్యంలో మంగళవారం మాజీ ఎమ్మెల్సీ శేరి. సుభాష్ రెడ్డి బిఆర్ఎస్ నాయకులతో కలసి పద్మ దేవేందర్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా అడిషనల్ కలెక్టర్ నాగేష్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే అనుచరులు అర్ధరాత్రి హంగామా సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసారన్నారు. స్థానికేతరులైన మల్కాజ్గిరి నుంచి వచ్చిన గుండాలు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలపై దాడులకు దిగి అకారణంగా దాడులకు పాల్పడ్డారని చెప్పారు. దాడులు చేస్తూ మా పార్టీ కార్యకర్తల నాయకులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. మెదక్, రామయంపేట ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని కోరారు. వీరి రామాయంపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగా నరేందర్, లింసన్పల్లి మాజీ సర్పంచ్ మహిపాల్ రెడ్డి, నాయకులు స్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.